సాక్షి సిద్దిపేట

గురువారం । 12 । జనవరి । 2023



సస్యరక్షణతోనే పంటలకు రక్షణ

సస్యరక్షణతో పంటలకు చీడపీడలు ఆశించకుండా కాపాడుకోవచ్చని హైదరాబాద్ కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత సూచించారు 8లో..



నేటి నుంచి చాముండేశ్వరీ జాతర

చిట్కుల్ చాముండేశ్వరీ ఆలయ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. 8లో..



దుబ్బాక అభివృద్ధే లక్ష్యం 9లో..

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం ధర్మాజీపేట వార్డులో ఆయన బస్ షెల్టర్లను ప్రారంభించారు.

న్యూస్‌రీల్

నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సిద్దిపేటజోన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా 'సాక్షి మీడియా, అంబిటాస్ స్కూల్' ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. అంబిటస్ స్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పది కన్సోలేషన్ ప్రైజ్‌లు అందించనున్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ చిత్రకారుడు రుస్తుం, డాక్టర్ మమతరెడ్డి, మహిళ కళాశాల అధ్యాపకులు సువర్ణ వ్యవహరించనున్నారు.

వేదిక: అంబిటస్ స్కూల్, భారత్‌నగర్, సిద్దిపేట
తేదీ: 12, జనవరి 2023
సమయం: ఉదయం 10 గంటలు

విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



శాంపిల్ సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: ఆరోగ్యంగా ఉన్నా ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం పోలీస్ అధికారులు, సిబ్బంది నుంచి వైద్య సిబ్బంది బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ నుంచి సైతం శాంపిల్స్ సేకరించారు. సీపీ మాట్లాడుతూ.. మంత్రి సూచన మేరకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. టెస్టులు ఎక్కువ చేయించుకుని మందులు తక్కువ వాడుకోవాలన్నారు. డాక్టర్ సలహాలు, సూచనలు తప్పకుండా అందరూ పాటించాలని తెలిపారు. సమయం దొరికినప్పుడల్లా యోగా, వాకింగ్, రన్నింగ్ చేస్తూ ఉండాలన్నారు. టెస్టుల ద్వారా ఒక్కొక్కరి ప్రొఫైల్ తయారు చేసి మూడు భాగాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టుకు పోలీస్ నోడల్ అధికారి దుబ్బాక సీఐ కృష్ణ ప్రతిరోజు మానిటర్ చేయడం జరుగుతుందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన సమాచార వాల్‌పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ దరఖాస్తులకు ఫిబ్రవరి 2 చివరి తేదీ అని, అలాగే మార్చి 5న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7995660882, 9347970096 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్‌ఓ నిర్మల, డీసీఓ అశోక్ బాబు, సునిత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

దుబ్బాక: మన బస్తీ మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ, వంటగది, భోజన శాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు వసతులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ విజయ ప్రకాశ్, ఏఈ రిజ్వాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజుల రామచంద్రం, తదితరులున్నారు.

భారీగా తగ్గిన దిగుబడి

- వానాకాలంలో 3.53 లక్షల ఎకరాల్లో వరిసాగు
- 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా
- కొన్నది కేవలం 4.12 లక్షల మెట్రిక్ టన్నులే
- 40 శాతం బయట అమ్మారంటున్న అధికారులు



దుబ్బాక మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు(ఫైల్)

దుబ్బాకటౌన్: వానాకాలంలో వరి ధాన్యం దిగుబడి భారీగా తగ్గింది. జిల్లాలో రికార్డు స్థాయిలో పంట సాగైనా దిగుబడి మాత్రం అనుకున్నంత రాలేదు. 3.53 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా .. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేశారు. కానీ కేవలం 4.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కాగా జిల్లాలో కొనుగోలు ప్రక్రియ డిసెంబర్ 25తో ముగియడంతో కొనుగోలు కేంద్రాలు మూసివేశారు.

డిసెంబర్‌లో ముగిసిన కొనుగోళ్లు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.53 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైంది. దిగుబడిపై భారీ అంచనాతో జిల్లా యంత్రాంగం కొనుగోళ్లకు ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. పంట విస్తీర్ణం దృష్ట్యా 7.50 లక్షల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, అలాగే సన్న రకం ధాన్యం 50 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని లెక్కలు వేశారు. మరో లక్ష టన్నుల వరకు దొడ్డు రకం ధాన్యం రైతులు బయట విక్రయించే అవకాశం ఉండగా మిగతా 6.50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి వస్తుందని అధికారులు అంచనా వేశారు. తీరా కొనుగోలు ప్రక్రియ ముగిసిన తర్వాత కేవలం 4.12 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసినట్లు తేలింది. అంచనా కంటే 2.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా సేకరణ జరిగింది.

తాలుగా మారిన పంట

ఆగస్టు 15 తర్వాత వేసిన వరి పంటకు రోగాలు సోకి పొట్ట దశలో ఈనిన గొలుసులు పాలు పోసుకోకుండా 70 శాతం వరకు తాలుగింజలయ్యాయి. దీంతో ఆలస్యంగా వేసిన పంటల దిగుబడి సగం కూడా రాకపోవడంతో పెట్టుబడి మీదపడింది. ఎకరానికి కనీసం 10 క్వింటాలు కూడా రాలేదని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. 3.53 లక్షల ఎకరాలు సాగు కాగా ఇందులో లక్షకు పైగా ఎకరాల్లో పంట ఆలస్యంగా వేశారు. ఆ పంట రోగాల బారిన పడి ఎంత మందులు కొట్టినా దిగుబడి చాలా తగ్గింది. అధికారులు మాత్రం 6.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని అంచనా పెట్టుకోగా రైతులు రైస్‌మిల్లర్స్, బయట వ్యాపారులకు 40 శాతం వరకు అమ్ముకున్నారని అందుకే కొనుగోలు కేంద్రాలకు తక్కువ ధాన్యం వచ్చిందని వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. 3.53 లక్షల ఎకరాలు సాగు అయితే సరాసరి (ఎకరానికి 24 క్వింటాళ్లు) చూసుకున్నా 8.47 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. కొనుగోలు కేంద్రాల ద్వారా 4.12 లక్షలు, అధికారులు బయట అమ్ముకున్నారని చెబుతున్న 40 శాతం అంటే 2 లక్షల టన్నుల వరకు ధాన్యం పోతే మిగతా 2లక్షలకు పైగా టన్నుల ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చిందని స్పష్టంగా తెలుస్తోంది.

తాలుపోయి వడ్లు ఎల్లలే



3 ఎకరాల వరి పంట వేస్తే 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. గొల తాలుపోయి వడ్లు ఎల్లలే. ఎన్ని మందులు కొట్టినా ఫలితం దక్కలేదు. ఇంత అధ్వానం ఎప్పుడు కాలేదు. పంట ఆలస్యంగా వేయడంతో రోగాలు వచ్చి దిగుబడి 30 శాతం కూడ రాలేదు. మూడు ఎకరాల్లో కనీసం 70 క్వింటాళ్ల పైన కావాలే కానీ 20 క్వింటాలు అయ్యాయి.

–రేపాక భూపతిరెడ్డి, రైతు, దుబ్బాక

దిగుబడి సరాసరి వచ్చింది



వానాకాలం పంట దిగుబడి సరాసరి వచ్చింది. కానీ రైతులు 40 శాతం వరకు బయటనే అమ్ముకున్నారు. గతేడాది 4.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయగా ఈ సారి 4.12 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగింది. సన్న రకం ధాన్యం రైతులు తినడానికి వినియోగించుకుంటున్నారు.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైస్ మిల్లర్స్‌కు విక్రయాలు



జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 4.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. బయట డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు రైస్ మిల్లర్స్, వ్యాపారులకు విక్రయించారు. కొనుగోలు ప్రక్రియ ముగియడంతో కేంద్రాలు మూసివేసి సేకరించిన ధాన్యం సంబంధిత రైస్‌మిల్లర్స్‌కు కస్టం మిల్లింగ్‌కు పంపించాం.

–హరీశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సామాజిక తనిఖీలో బయటపడిన నిర్లక్ష్యం

డీఆర్డీఓ గోపాల్‌రావు



మాట్లాడుతున్న గోపాల్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి పనులల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, సామాజిక తనిఖీలో అధికారుల నిర్లక్ష్యం బయటపడినట్లు డీఆర్డీఓ గోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో చనిపోయిన వారి పేరున సైతం ఉపాధి కూలీ డబ్బులు చెల్లించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లుకు సైతం ఉపాధి చెల్లింపులు చేసినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. రికార్డు లేకుండా చెల్లింపులు చేసినట్లు తనిఖీల్లో బయటపడ్డయన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీకి ఆదేశించమాన్నారు. అంతకు ముందు మండలానికి సంబంధించిన 21 పంచాయతీల పరిధిలో జనవరి 2020 నుంచి మార్చి 2022 వరకు జరిగిన 3,290 పనులపై ప్రజావేదికలో రికార్డులను పరిశీలించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్డీఓ కౌసల్యాదేవి, అంబుడ్స్‌మెన్ ఖాన్, అడిషనల్ విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ఖాజామొహీనుద్దీన్, ఈసీ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులపై మరింత ప్రత్యేక శ్రద్ధను తీసుకుని మంచి ఫలితాలను సాధించేందుకు కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లా ప్రిన్సిపాల్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో నూతన సంవత్సరం కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కలిసికట్టుగా పనిచేసి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచం గారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

కొమురవెల్లిలో పట్నాల టికెట్ పెంపు

- పలు తీర్మానాలు చేసిన ధర్మకర్తల మండలి
- ఆలయంలో ప్రత్యేక సమావేశం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మొక్కుబడి టికెట్స్(పట్నాలు) ధరలు పెంచాలని ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారు. బుధవారం ఆలయంలో చైర్మన్ గీస భిక్షపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దీనితో పలు అంశాలపై తీర్మానించారు.

- నిర్లక్ష్యం వహించిన జూనియర్ అసిస్టెంట్ ఇ.సందీప్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి.
- దేవాలయానికి మంజూరై ఖాళీగా ఉన్న డోల, శృతి పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి.
- గంగిరేణి చెట్టు మహా మండపంలోనికి కోతులు రాకుండ జాలీలు ఏర్పాటు చేయాలి.
- స్వామివారికికి బంగారు రుద్రాక్షమాల, కోర మీసం, లింగంకాయ, అమ్మవార్లకు బంగారు కిరీటం తయారు చేయించాలి.
- దాసారం గుట్ట సర్వే నం.305/ఎ లోని 22 ఎకరాల ఒక గుంట భూమిని ల్యాండ్ అక్విజేషన్ ద్వారా కొనుగోలు చేయాలి.
- భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో రెండు బోర్లు వేయించాలి.
- మాట్లాడుకునేందుకు వాకీటాకీలు ఖరీదు చేయాలి.
- నూతనంగా గోశాల నిర్మాణం చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఈవో బాలాజీ, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు మరుపల్లి శ్రీనివాస్, చెట్కూరి తిరుపతి, కాసర్ల కనకరాజు, జూటోత్ స్వప్న, మల్లేశ, కందూరి సిద్ధిలింగం, కొంగరి గిరిధర్, గడ్డం మహేశ్ యాదవ్, పచ్చిమడ్ల సిద్ధి రాములు, సూటిపల్లి బుచ్చిరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధర్మకర్తల మండలి సమావేశం

ఉమ్మడి జిల్లాతో నూతన సీఎస్ అనుబంధం

- జేసీ, కలెక్టర్‌గా పనిచేసిన శాంతికుమారి
- మూడేళ్ల పాటు జిల్లాలో సేవలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వ నూతన చీఫ్ సెక్రటరీగా నియమితులైన శాంతికుమారికి ఉమ్మడి మెదక్ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. 1989 బ్యాచ్‌కు చెందిన ఈ సీనియర్ ఐఏఎస్ అధికారి జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసి జిల్లా పాలనపై తనదైన ముద్ర వేశారు. జాయింట్ కలెక్టర్‌గా 1994 జూలై నుంచి 1995 ఏప్రిల్ వరకు పనిచేశారు. ఆ తర్వాత 1999 నవంబర్ నుంచి 2001 మే వరకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా దాదాపు మూడేళ్ల పాటు జిల్లాలో కీలక స్థానాల్లో పని చేశారు. జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఆమె జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కూడా ఇన్‌చార్జి బాధ్యతల్లో కొనసాగారు. అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సేవలందించారు.

జాతీయ స్థాయికి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పర్యావరణ ప్రదర్శన, ఇన్‌స్పైర్ మానక్–2023 ప్రదర్శనలో జిల్లాకు చెందిన నాలుగు విద్యార్థుల ప్రదర్శనలు, ఒకటి ఉపాధ్యాయుల ప్రదర్శన, ఒక సెమినార్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు 17 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు, 14 సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు, ఒకటి టీచర్ ఎగ్జిబిట్, సెమినార్‌లో ప్రదర్శించారు. కేజీబీవీ మర్కుక్‌కు చెందిన బి. శైలజ (మంజుల గైడ్ టీచర్), మోడల్ స్కూల్ ముట్రాజ్‌పల్లికు చెందిన ఎ.వెన్నెల (రజిని గైడ్ టీచర్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌కు చెందిన కె.నమృత (నిరంజన్ గైడ్ టీచర్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అహ్మదీపూర్‌కు చెందిన వి.పూజ (హఫీస్ గైడ్ టీచర్) సారథ్యంలోని ప్రాజెక్టులు జాతీయ స్థాయి ప్రదర్శన పోటీలకు ఎంపికయ్యాయి. అలాగే జెడ్పీహెచ్‌ఎస్ సిరిసనగండ్లలో విధులు నిర్వహిస్తున్న రూపారాణి రూపొందించిన టీచర్ ఎగ్జిబిట్, జెడ్పీహెచ్‌ఎస్ ఇందిరానగర్‌కు చెందిన సాకేత్ జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపికయ్యారు. బుధవారం నిర్మల్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రశంస పత్రాలు, మెమొంటోతో సత్కరించారు. ఎంపికకైన వారిని డీఈఓ శ్రీనివాసరెడ్డి , జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అభినందించారు.



ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మట్టి రోడ్లకు మహర్దశ

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.23.49 కోట్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 23.49కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మట్టి రోడ్లకు మహర్దశ రానునందన్నారు. చిన్నకోడూరు నుంచి ఎల్లమ్మ జాలు రోడ్డు నిర్మాణానికి రూ.85 లక్షలు, ఒబుటాపూర్ నుంచి కస్తూరిపల్లి వరకు రూ.1.46 కోట్లు, పెద్దకోడూరు నుంచి రాజీవ్ రహదారి వరకు రూ.1.42 కోట్లు, శంకరాయకుంట నుంచి గోనెపల్లి వరకు రూ.95 లక్షలు, మేడిపల్లి నుంచి రాజీవ్‌రహదారి వరకు రూ.2.37 కోట్లు, చంద్లాపూర్ నుంచి రామంచ వరకు రూ. 1.94 కోట్లు, మాచాపూర్ నుంచి రంగాయపల్లి వరకు రూ.4.40 కోట్లు, చర్లఅంకిరెడ్డి పల్లి నుంచి కస్తూరిపల్లి వరకు రూ.3.62 కోట్లు, చిన్నకోడూరు నుంచి రాజీవ్ రహదారి వరకు రూ. 2.47 కోట్లు, ఆదిపెరుమాండ్ల ఆలయం నుంచి గంగాపూర్ వరకు రూ. 2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరితగతిన పనుల టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.

కార్మికుల సంక్షేమానికి చొరవ చూపాలి

గజ్వేల్‌రూరల్: రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ కమిటీ అధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్మికుల సంఘర్ష్ యాత్ర బుధవారం గజ్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టం 2019 రవాణా రంగ కార్మికులకు, లారీ, కారు, డీసీఎం, గూడ్స్ వాహనాల యజమానులకు గుదిబండగా మారిందని మండిపడ్డారు. ఈ చట్టం ద్వారా అత్యధికంగా పన్నులు వేయడంతో పాటు డ్రైవర్ల లైసెన్సును రద్దు చేసే విధంగా సెక్షన్లను జోడించినట్లు తెలిపారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికులందరికీ బీమా, పెన్షన్లను అమలు చేయాలని, గుర్తింపు కార్డులను ఇవ్వడంతో పాటు ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, నాయకులు బండ్ల స్వామి, వేణుగోపాల్, సాదక్, సంజీవ రెడ్డి, కరుణాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

- మహిళా జట్టు విజేత 'మల్లంపల్లి'.. పురుషుల జట్టు 'చౌటపల్లి'
- నగదు బహుమతి అందజేసిన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్



ఫైనల్‌లో తలపడుతున్న హుస్నాబాద్, చౌటపల్లి జట్లు

హుస్నాబాద్: హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణంలో కబడ్డీ ఫైనల్ పోటీలు బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగాయి. నువ్వా నేనా అన్నట్లుగా క్రీడాకారులు తలపడ్డారు. రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు ముగిశాయి. మహిళల ఫైనల్ పోటీల్లో మల్లంపల్లి జట్టు, హుస్నాబాద్ మోడల్ స్కూల్ జట్టు తలపడ్డాయి. ఈ పోటీల్లో మల్లంపల్లి జట్టు విజేతగా నిలిచింది. పురుషుల కబడ్డీ ఫైనల్‌లో హుస్నాబాద్, చౌటపల్లి జట్లు తలపడ్డాయి. ఇందులో చౌటపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్లకు రూ.10వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్లకు రూ.5వేల నగదు బహుమతిని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ అందజేశారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపు, ఓటమిలు సహజమేనన్నారు. హుస్నాబాద్ గడ్డ అన్ని కలలకు నిలయమని ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతను ప్రోత్సహించేందుకు సీపీ శ్వేత ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు, రన్నరప్‌లకు గురువారం సిద్దిపేటలో సీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఇందులో 8 మహిళా జట్లు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు శ్రీధర్, వివేక్, నరేందర్‌రెడ్డి, పీఈటీలు జంగపల్లి వెంకటనర్సయ్య, సత్యనారాయణ రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న పోలీస్ అధికారులు

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం కొందరికి జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్ బాబు వారికి రూ.29 వేల జరిమానా, వీరిలో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష విధించారు.

రైతుల ఇంట్లో పత్తి చోరీ

అల్లాదుర్గం(మెదక్): రైతు ఇంటిలో నిల్వచేసిన పత్తి బస్తాలను ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ దేవీదాస్ పవార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన అశోక్, ఆకుల జనార్దన్ ఇంటిలో పత్తి బస్తాలను నిల్వ చేశారు. గుర్తు తెలియని దొంగలు రెండు క్వింటాళ్ల బస్తాలు ఎత్తుకెళ్లారు. చోరీపై రైతు అశోక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

న్యూసెన్స్ కేసులో జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి పోలీసుపట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తికి జడ్జి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎర్రచెరువు మైసమ్మగుడి సమీపంలో నరేష్ మద్యం తాగుతున్నాడు. కానిస్టేబుల్ బాబు, హోంగార్డు బాపురెడ్డి బహిరంగంగా ఎందుకు మద్యం తాగుతున్నావని ప్రశ్నించగా వారిపట్ల దురుసుగా ప్రవర్తించాడు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేసిన జడ్జి నిందితుడికి రూ.550 జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

వ్యక్తి అదృశ్యం


లాలారామ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: స్నేహితుడి దగ్గరికి వెళ్తున్నానని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన రమేశ్ వద్దకు ఈనెల 4వ తేదీన బెంగుళూరు నుంచి బాబాయి లాలారామ్ వచ్చాడు. 5వ తేదీన మియాపూర్‌లో ఉండే స్నేహితుడి వద్దకు వెళ్తానని చెప్పడంతో రమేశ్ పటాన్‌చెరు బస్టాండ్‌లో సికింద్రాబాద్ బస్సు ఎక్కించాడు. సాయంత్రం బాబాయి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తెలిసిన వారిని ,బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. రమేశ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి చాముండేశ్వరీ జాతర

- మూడు రోజులపాటు నిర్వహణ
- మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ సమీపంలో ఆలయం
- దక్షిణ భారత దేశంలో రెండో అతి పెద్ద దేవాలయంగా ప్రసిద్ధి
- 9 అడుగుల ఎత్తు, 18 చేతులు జ్వాలాకిరీటంతో ఏకశిలా విగ్రహం


చిట్కుల్ సమీపంలోని చాముండేశ్వరీ ఆలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్):

- భక్తులకు ఇలవేల్పు చాముండేశ్వరీ అమ్మవారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ సమీపంలో మంజీరా తీరాన పచ్చటి పొలాల మధ్య ఈ ఆలయం ఉంది. దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద ఆలయంగా ప్రసిద్ధి. ఆలయంలో చాముండేశ్వరీ అమ్మవారు శక్తి స్వరూపిణిగా, 9 అడుగుల ఎత్తు, 18 చేతులతో జ్వాలా కిరీటంతో భక్తులకు దర్శనమిస్తుంది.
- గురువారం నుంచి శనివారం వరకు చాముండేశ్వరీ అమ్మవారి ఆలయ 40వ వార్షిక ఉత్సవాలు ఘనంగాజరుగుతాయి.

ఆలయ చరిత్ర :

- నెల్లూరు జిల్లా పాత కోడూర్ గ్రామానికి చెందిన అయిలావర్‌ఝుల వెంకటరమణయ్య అమ్మవారి భక్తుడు. చాముండేశ్వరీ ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో దేశంలోని వివిధ నదీ తీరాల వెంబడి సుమారుగా పదేళ్ల పాటు తిరిగి చివరికి చిట్కుల్ సమీపంలో మంజీరా నది ఒడ్డున ఆలయాన్ని నిర్మించారు.
- ఇక్కడ మంజీరా నది దక్షిణ తీరం నుంచి ఉత్తరానికి ప్రవహిస్తుంది. రోడ్డు మార్గం కూడా ఉండటంతో చిట్కుల్ గ్రామానికి చెందిన నారాయణ రెడ్డికి సంబంధించిన స్థలంలో గ్రామస్తులు సహకారంతో ఆలయ నిర్మాణానికి సిద్ధమయ్యారు.
- 1983లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1985లో ఆలయం నుంచి మంజీరా నది వరకు లక్షదీపోత్సవం నిర్వహించారు.
- అమ్మవారి ముఖం పడమర దిక్కున మంజీరా నది ప్రవాహాన్ని చూస్తుండటం విశేషం. అమ్మవారి ఎదురుగా బ్రహ్మి, కాళీ, వైష్ణవి దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

విగ్రహ ప్రత్యేకత:

- కరీంనగర్ జిల్లా ధర్మపురి నుంచి శిలలను తెప్పించి తమిళ శిల్పాచార్యులతో చాముండేశ్వరీ అమ్మవారి విగ్రహాన్ని చేయించారు. 9 అడుగుల ఎత్తు, 18 చేతులు, జ్వాలా కిరీటం ప్రత్యేక ఆకర్షణగా మలిచారు.
- గర్భ గుడిలో విగ్రహానికి ఒక వైపు మహిషాసురుడు, మరోవైపు సింహం ఉంటుంది. ఆలయ గోపురం ఎత్తు 85 అడుగులు ఉంటుంది.
- ప్రస్తుతం ఆలయం ముందు రాజగోపుర నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఏటా రెండు సార్లు ఉత్సవాలు

- అమ్మవారి ఉత్సవాలు ఏటా రెండు సార్లు నిర్వహిస్తారు. ఆశ్వీయుజ మాసంలో దేవీ నవరాత్రులతో పాటు, పుష్యబహుళ పంచమి నుంచి సప్తమి వరకు ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతాయి.
- ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, కలశాలతో నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తారు. దీంతో పాటు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. కుంకుమార్చన అమ్మవారి పాదాలపై జరగడం విశేషం.


ఆలయంలో కొలువైన చాముండేశ్వరీ అమ్మవారు

ఆలయానికి చేరిక ఇలా..

- హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా చాముండేశ్వరీ దేవి ఆలయాన్ని చేరుకోవచ్చు. మెదక్ వైపు నుంచి జోగిపేట మార్గం, నర్సాపూర్ నుంచి జోగిపేటకు వెళ్లే మార్గం, ద్వారా చాముండేశ్వరీ ఆలయాన్ని చేరుకోవచ్చు.



కనుల పంట

చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంటలు ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. పుసుపు పచ్చని పూలసోయగం చూపరులను ఆకట్టుకుంటోంది. రోడ్ల పక్కనే ఉండటంతో వాహనదారులు కొద్దిసేపు ఆగి వాటి అందాలను ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, సిద్దిపేట

‘యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్’ కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)ను కొనసాగించాలని, దీంతో పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)సిద్దిపేట జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం ఎంతటి ప్రమాదకరమైనదో విదేశీ విశ్వవిద్యాలయాలను భారత్‌లోకి ఆహ్వానిస్తూ మోడీ సర్కార్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా పత్రం మరోసారి తేటతెల్లం చేసిందన్నారు. అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు ఫీజులు, అడ్మిషన్లపై నియంత్రణ ఎత్తివేస్తున్నట్లు ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలను స్వాగతిస్తుండటం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. ఇది దేశంలోని ఉన్నత విద్యను మొత్తం విదేశీ కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో పెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ చదువు వరకూ మనదేశ పరిస్థితులకు అనుగుణంగా సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజు, ఆముదాల రంజిత్, జిల్లా సహాయ కార్యదర్శులు కర్రోల్ల నవీన్, నాచారం శేఖర్, రామగల్ల నవీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి


పెదుతల ప్రతాప్‌రెడ్డి, బాలమణి దంపతులకు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణలోని పాఠశాలలను సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యేముత్తిరెడ్డి యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని ముస్త్యాల ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి ద్వారా మంజూరైన రూ.1.20 కోట్ల వ్యయంలో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన పెడుతల ప్రతాప్‌రెడ్డి, బాలమణి దంపతులను సన్మానించి పాదాభివందనం చేశారు. పాఠశాలలో కొన్ని చెట్లను తొలగించినందుకు గ్రామ పంచాయతీ ప్రధానోపాధ్యాయుడికి రూ.4,116 జరిమాన విధించగా, ఆ జరిమానా ఎమ్మెల్యే చెల్లించి రశీదు తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. మన ఊరు మన బడిలో మొదటి విడతగా రూ.7 వేల కోట్లను కేటాయించి పాఠశాలలను బాగు చేస్తూన్నారన్నారు. పెడుతల ప్రతాప్‌రెడ్డి, బాలమణి దంపతులు గ్రామాన్ని అభివృద్ధి చేస్తుండటం , పాఠశాలల్లో వసతులు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు.

జాతీయ ఉత్సవాలకు ఎంపిక


హుస్సేన్‌తో పీడీ ప్రవీణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈనెల 12 నుంచి 16 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న 26వ జాతీయ యువజన ఉత్సవాలకు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ విద్యార్థి హుస్సేన్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ పద్మ బుధవారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుస్సేన్ జాతీయ క్రీడలకు ఎంపికయ్యాడు. జాతీయ యువజనోత్సవాల్లోనూ ప్రతిభ చూపి రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు తేవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

మతిస్థిమితం లేని యువతి సఖి కేంద్రానికి అప్పగింత


యువతిని సఖి కేంద్రానికి అప్పగిస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): మతిస్థిమితం లేని గుర్తు తెలియని యువతిని సిద్దిపేట సఖి కేంద్రానికి అప్పగించినట్లు ఎస్ఐ నారాయణ బుధవారం తెలిపారు. దూల్మిట్ట మండలం హన్మతండా పరిధి శిబ్బితండాలో మతిస్థిమితం లేని యువతిని స్థానికుల సమాచారంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా సఖి కేంద్రానికి పంపించిన్నట్లు తెలిపారు. యువతి తన పేరు రజిత అని, తానెవరో పూర్తి వివరాలు వెల్లడించడం లేదన్నారు.

సస్యరక్షణతోనే పంటలకు రక్షణ

సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత


అహ్మదీపూర్‌లో మొక్కజొన్న సాగును పరిశీలిస్తున్న కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు

గజ్వేల్: సస్యరక్షణతో పంటలకు చీడపీడలు ఆశించకుండా కాపాడుకోవచ్చని హైదరాబాద్ కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో యాసంగి పంటల పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. అంతకు ముందు మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు ఆశించే కత్తెర పురుగు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయోపెస్టిసైడ్స్ వాడకంపై అవగాహన కల్పించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవసరమైన సమావేశాలను నిర్వహించుకోవడానికి నిర్మించిన రైతు వేదికలతో మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. క్లస్టర్‌కు ఒక ఏఈఓను నియమించి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించడం కలిసివస్తున్నదని తెలిపారు. సదస్సులో సిద్దిపేట జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్, రైతుబంధు సమితి గజ్వేల్ మండల అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, ఏపీపీఓలు నీలరాణి, రవిశంకర్, గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజు, సర్పంచ్ చాడ నవీన శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందం పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఎంపీడీఓ


బుధవారం ఉదయం 11.30 గంటలకు ఖాళీ కుర్చీ దర్శనం ఇస్తున్న దృశ్యం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండల పరిషత్ అధికారులు సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం 11.30 గంటలైనా ఎంపీడీఓ, ఇతర అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చినవారికి ఖాళీకుర్చీలు దర్శనమిచ్చాయి. మండలంలో ఏ పని జరగాలన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. అధికారులు సమయానికి రాకపోవడంతో నానా అవస్థలుపడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీఓ వారానికి మూడు నాలుగు రోజులు మాత్రమే కార్యాలయానికి వస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నారు. ఎవరైనా అడిగితే గ్రామాల్లో విజిటింగ్‌లో ఉంటున్నామని సమాధానం చెబుతున్నారని స్థానికులు చర్చించుకుటున్నారు. అధికారులు సమయపాలన పాలన పాటించాలని కోరుతున్నారు.

క్రీడాకారులను సన్మానించిన ఎంపీ


క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ యూనివర్శిటీ క్రీడా పోటీలకు మిరుదొడ్డికి చెందిన అందె చేతన్ గౌడ్, గొట్టం నవీన్, వేముల యువతేజ్, మద్దెల పరుశరాములు, అందె పవన్ గౌడ్ ఈనెల 13 నుంచి 17 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు యూనివర్శిటీ పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మిరుదొడ్డి మండల కేంద్రం నుంచి ఐదురుగు క్రీడాకారులు జాతీయ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో క్రీడాకారులకు ప్రాధాన్యతనిచ్చి క్రీడారంగాన్ని మరింతగా ప్రోత్సహిస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీల్లో రాణించి తెలంగాణ పేరును నిలబెట్టాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. బాల్‌బాడ్మింటన్‌లో మిరుదొడ్డి నుంచి జాతీయ స్థాయిలో పోటీ పడేలా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన మెదక్ ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్యను ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ చందపురం మల్లేశం పాల్గొన్నారు.

గోదాంలో అగ్నిప్రమాదం

మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో టీఎస్ఐఐసీకి చెందిన పారిశుధ్య కార్మికుడు చెత్తను తగలబెట్టాడు. సమీప బహిరంగ గోదాంలో ఉంచిన రియాక్టర్లకు మంటలు వ్యాపించాయి. రియాక్టర్లలో కొద్దిగా రసాయనాలు మంటలు చెలరేగాయి. దీంతో పటాన్‌చెరు అగ్నిమాపక కేంద్రం, పాశమైలారం పారిశ్రామిక వాడ నుంచి ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. పెట్రోల్ బంక్ పక్కనే ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సంఘటనా స్థలాన్ని స్టేషన్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జన్యా నాయక్, పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

మల్లికార్జున స్వామిని దర్శించుకున్న సివిల్ సప్లయ్ చైర్మన్

దుబ్బాకటౌన్: దుబ్బాక మండల పరిధిలోని రేకుల కుంట మల్లికార్జున స్వామిని రాష్ట్ర సివిల్ సప్లయ్ చైర్మన్ రవీందర్ సింగ్ బుధవారం దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి, రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ రొట్టె రమేశ్, ఆలయ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత


కలప లారీని పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

అల్లాదుర్గం(మెదక్): లారీలో అక్రమంగా కలప తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకుని, ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం రాంపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీతానగర్ గ్రామంలో కలప వ్యాపారి సుబాబుల్, నీలగిరి చెట్లను కొనుగోలు చేశారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చెట్లను నరికి వాటిని లారీలో తరలిస్తున్నాడు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ తులసీరాం సిబ్బందిని పంపించి కలప లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దశంకరంపేట ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి చెరుకోవడంతో కలప లారీని వారికి అప్పగించారు. ఈ విషయంపై పెద్దశంకరంపేట రెంజ్ అధికారి వికాస్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా సుబాబుల్, నీలగిరి చెట్లన నరికి తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్


కిందకు దూకే ప్రయత్నం చేస్తున్న దృశ్యం

సిద్దిపేటకమాన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించడం సిద్దిపేట పట్టణంలో కలకలం రేపింది. డివైడర్ మధ్యలోని (టీపోల్) హోర్డింగ్ ఎక్కి మెడలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించగా స్థానికుల సహాయంతో పోలీసులు క్షేమంగా కిందికి దించగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అలియాస్ కుమార్‌కు భార్య ఇద్దరు సంతానం. అతడు డ్రైవర్‌గా, భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కుటుంబకలహాలతో భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మద్యం మత్తులో పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలోని రోడ్డు మధ్యలోని (టీపోల్) హోర్డింగ్ ఎక్కి మెడలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వన్ టౌన్ బ్లూకోల్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అతడిని కిందకు దించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఆ రూట్‌లో వెళుతున్న ప్రైవేటు స్కూల్ బస్‌ను హోర్డింగ్ ఎక్కిన వ్యక్తి కిందకు దిగేలా అతడి కిందికి దించారు. స్థానికుల సహాయంతో పోలీసులు అతడిని కిందకు దించారు. అనంతరం కుమార్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించి, అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


హారిక (ఫైల్)


తూప్రాన్: విద్యుదాఘాతంతో బాలిక మృతి చెందింది. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈసురి రామస్వామికి ముగ్గురు సంతానం. రెండో కూతురు హారిక(12) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. బుధవారం ఇంటిలో స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. తోటి విద్యార్థులు కంటతడిపెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీకాంత్ మృతదేహం

పటాన్‌చెరుటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మృతిచెందాడు. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ జాతీయ రహదారిపై డిసెంబర్ 29వ తేదీన ఇస్నాపూర్ గ్రామస్తుడు శ్రీకాంత్ రోడ్డుదాటుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం రాలేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వినోద్

పాపన్నపేట(మెదక్): డబుల్ బెడ్రూం అర్హుల జాబితాలో తన పేరు లేదని ఓ దళిత యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండల పరిధిలోని రామతీర్థంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంగెపు వినోద్, అన్న బాబుతో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆస్తులు పంచుకుంటే అన్నకు వస్తుందని, తనకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల అర్హుల జాబితా గ్రామ పంచాయతీ బోర్డులో ఉంచారు. అందులో అతడి పేరు లేకపోవడంతో కలత చెంది వ్యవసాయ భూమిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తోటివారు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో అనర్హులకు ఇళ్లు ఇచ్చి తనకు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని బాధితుడు వాపోయాడు. వినోద్‌కు భార్యచ ఇద్దరు కొడుకులు ఉన్నారు.